క్లుప్తంగా

బాలుర వసతిగృహం పరిశీలన



మైలవరం: విద్యార్థులు ఇష్టంతో చదివడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తారని సివిల్ సప్లయిస్ డీఎం, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహ ప్రత్యేకాధికారి టి. సతీష్ అన్నారు. మైలవరంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన సందర్శించారు. వసతిగృహంలో సౌకర్యాలు, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒక్క సారైనా నీటి పరీక్ష చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత బహుజన ఐక్యవేదిక నిరసన



విస్సన్నపేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని బహుజన దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. స్థానిక బహుజన దళిత ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన దళిత ఐక్యవేదిక నాయకులు గొర్రె లాజరస్, సిరసాని ప్రకాష్, పల్లెపాం లక్ష్మయ్య, ముంగా జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు కల్తీమద్యంపై మహిళల నిరసన

తిరువూరు: కల్తీ మద్యం అమ్మకాలను నిరసిస్తూ తిరువూరులో ఈ నెల 13న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమం నిర్వహిస్తామని పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పి. సుధారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు నియోజకవర్గ కార్యాలయం నుంచి ఫ్యాక్టరీ సెంటర్‌లోని ఎక్సైజ్ స్టేషన్ వరకు ప్రదర్శన, అనంతరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఉదయం 9 గంటలకు నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విజేతలకు అభినందన



మైలవరం: బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీల్లో మైలవరం మండల విద్యార్థులు ప్రతిభ చూపారు. విజయవాడ బిషప్ అజరయ్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం పోటీలు జరిగాయి. డిబేట్ విభాగంలో మైలవరం ఎంబీఎం జెడ్పీ హెచ్ బాలికల హైస్కూల్ విద్యార్థి ఎస్‌కే గుల్షన్ ఆరా ప్రథమ స్థానం, వ్యాస రచనలో జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని పి. వర్షిణి ద్వితీయ స్థానంలో నిలిచింది. చిత్రలేఖనంలో జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎస్‌కే నషీమ్ ద్వితీయ స్థానం సాధించింది. వీరికి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మోదీ పాలనలో అభివృద్ధి శూన్యం

సీపీఐ ఎంఎల్ లిబరేషన్

చాట్రాయి: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో దేశంలో అభివృద్ధి జరగలేదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు అన్నారు. శనివారం చాట్రాయిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. నవంబర్ 1న నూజివీడులో లిబరేషన్ పార్టీ జిల్లా మహాసభ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కలపాల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు చాట్ల బాబూరావు, ఐఫా మండల కమిటీ సభ్యులు బంటు పూజిత తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఏపీ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ శనివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తెల్లవారుజామున చిల్లకల్లు టోల్‌ప్లాజా రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమండ్రి నుంచి నల్గొండకు వెళ్తున్న రెండు లారీలను పరిశీలించి ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ధాన్యం లోడును రాజమండ్రిలో అన్‌లోడ్ చేసి గోదావరిలో ఇసుక లోడ్ చేసుకుని అక్రమంగా నల్గొండ తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో నల్గొండకు చెందిన యజమాని బచ్చబోయిన యాదవయ్యతో పాటు డ్రైవర్లు దాసరి శ్రావణ్, మేడబోయిన శంకర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి లారీలను సీజ్ చేశారు.

వ్యవసాయం.. డ్రోన్ల సాయం

- పెరిగిన డ్రోన్ల వినియోగం
- పురుగులు, నానో ఎరువుల పిచికారీ
- ప్రతి మొక్కకు సమానంగా మందు
- తగ్గుతున్న కూలీల ఖర్చు, సమయం ఆదా



జూపూడి లంక గ్రామంలో మొక్కజొన్న పంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. పురుగు మందులు, జీవ రసాయన ఎరువులను పొలంపై పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. వీటితో తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు, ఎరువులు పిచికారీ చేసుకోవచ్చని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

80 శాతం సబ్సిడీపై అందజేత

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలోనే డ్రోన్ల వినియోగానికి బీజం పడింది. ఐదుగురు సభ్యులు గ్రూపుగా ఏర్పడితే వ్యవసాయ శాఖ 80 శాతం సబ్సిడీ అందిస్తోంది. రైతులు 20 శాతం చెల్లిస్తే సరిపోతుంది. డ్రోన్ల వినియోగంతో కూలీలకు క్రిమికీటకాల ముప్పు తప్పుతుంది. డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు భవిష్యత్‌లో చోటుచేసుకుంటాయని మైలవరం వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవలి కాలంలో కొండపల్లి మున్సిపాల్టీ, మండల పరిధిలోని కొటికలపూడి సంఘాలకు రెండు డ్రోన్లను సబ్సిడీపై అందజేశారు.

గ్రూపుగా ఏర్పడితేనే..

వ్యవసాయ రంగంలో వినియోగించే డ్రోన్లు పొందాలంటే పొలం కలిగిన సన్న చిన్నకారు రైతులు ఐగురు ఒక గ్రూపుగా ఏర్పడాలి. వారిలో కనీసం ఇంటర్ చదివిన రైతు కూడా ఒకరు ఉండేలా చూసుకోవాలి. గ్రూపు సభ్యులు మండల వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రాల్లో గ్రూపు పేరుతో డ్రోన్ అవసరాన్ని తెలియజేస్తూ నమోదు చేసుకోవాలి. వారిలో ఇంటర్ చదివిన రైతుకు 12 రోజుల పాటు డ్రోన్ ఆపరేటింగ్‌లో పైలెట్‌గా శిక్షణ ఇస్తారు. వ్యవసాయ శాఖ నిధులు మంజూరు చేసిన అనంతరం బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి డ్రోన్ ధర రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉంటుంది. నాలుగు బ్యాటరీలతో డ్రోన్ అందజేస్తారు. అవసరమైతే బ్యాంక్ రుణం కూడా మంజూరు చేస్తారు. కొందరు రైతులు వ్యక్తిగతంగా డ్రోన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

డ్రోన్‌ల వినియోగంతో మెరుగైన ఫలితాలు

పురుగు మందుల పిచికారీ, రసాయన జీవన ఎరువుల పిచికారీకి డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ సమయం, తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్‌తో పిచికారీ చేయడంతో పొలం అంతటా ఒకే రీతిలో మందు పిచికారీ అవుతుంది. పది లీటర్ల మందు నీరు పట్టే ట్యాంకు వున్న డ్రోన్ సాయంతో ఒక ఎకరా విస్తీర్ణంలో గరిష్ఠంగా పది నిమిషాల్లో పిచికారీ చేయవచ్చు. అంతేకాక మొక్కల అన్ని భాగాలకు సమానంగా మందు తగులుతుంది. తద్వారా తెగుళ్ల త్వరగా నియంత్రణ అవుతాయి. దీనివల్ల పురుగు మందుల ఖర్చులు తగ్గి, ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుంది. వరి, చెరకు, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు డ్రోన్లతో మందులను పిచికారీ చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

వ్యక్తిగతంగా డ్రోన్లు మంజూరు చేయాలి



డ్రోన్లకు వ్యవసాయ శాఖ సబ్సిడీ ఇవ్వడం మంచి పరిణామం. అయితే గ్రూపు సభ్యులకు మంజూరు చేయడం వలన విభేదాలు తలెత్తే అవకాశం ఉంది. మండలంలో కొందరు రైతులు ఒక్కొక్క రైతు 50 నుంచి వంద ఎకరాల వరకు పంటలు సాగు చేస్తున్నారు. అలాంటి వారికి వ్యక్తిగతంగా డ్రోన్లు మంజూరు చేయాలి. గ్రూపులో విభేదాలు వస్తే డ్రోన్ వినియోగం పక్కదారి పడుతుంది.

– జొన్నలగడ్డ సాంబశివరావు, రైతు, మూలపాడు

డ్రోన్లతో అనేక ప్రయోజనాలు



డ్రోన్లతో మందు చల్లడం వలన తక్కువ సమయంలో చీడపీడలు నివారణ అవుతాయి. కూలీల కొరత నివారించవచ్చు. ఆసక్తి గల రైతులు వ్యవసాయ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– రజని, వ్యవసాయాధికారి, ఇబ్రహీంపట్నం

నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



శోభనాచలుడికి పూజలు చేస్తున్న ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: నూజివీడు మాజీ ఎమ్మెల్యే, వంశపారంపర్య ఆలయ ధర్మకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జన్మదినం సందర్భంగా శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషుబాబు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని ఆ శోభనాచలుడిని కోరుకున్నానని చెప్పారు. అనంతరం పలువురు నాయకులు పూలమాలలు, శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి పల్లె రవీంద్రారెడ్డి, నూజివీడు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు ఈలప్రోలు సుబ్బయ్య, నియోజకవర్గ వలంటీర్ల వింగ్ అధ్యక్షుడు నందూరు భాస్కర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సాదం గోపి, రాణి మేకల సత్యనారాయణ, నాగుల్ మీరా, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో జగనన్న కాలనీ



విద్యుత్ సరఫరా చేయాలని రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న స్థానికులు



వీధిలైట్లు వెలగక అంధకారంలో ఉన్న జి.కొండూరు జగనన్న కాలనీ

- వీధిలైట్లకు, పంచాయతీ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేత
- మీటర్ల ఏర్పాటుకు డబ్బులు చెల్లించలేదంటున్న అధికారులు
- రోడ్డెక్కి కాలనీవాసుల నిరసన

జి.కొండూరు: జగనన్న కాలనీ వాసులపై వివక్ష కొనసాగుతూనే ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు మీటర్ల ఏర్పాటుకు డబ్బులు చెల్లించలేదనే నెపంతో జి.కొండూరు జగనన్న కాలనీలో వీధి లైట్లు, గ్రామ పంచాయతీ బోర్లకు విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

150 కుటుంబాల నివాసం

జి.కొండూరు జగనన్న కాలనీ 30వ నంబరు జాతీయ రహదారి పక్కన ఉంది. ఇక్కడ 374 ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయగా 200లకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే పూర్తయిన ఇళ్లలో 150 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నారు. ఇక్కడ గ్రామ పంచాయతీ బోర్లు రెండు ఉండగా వీటిలో విద్యుత్ మోటార్లను బిగించారు. వీటితో పాటు జగనన్న కాలనీ మొత్తం 60 వీధి లైట్లు ఉన్నాయి. వీటికి విద్యుత్ సరఫరా చేసేందుకు నాలుగు మీటర్లను కూడా విద్యుత్ శాఖ అధికారులు అమర్చారు. అయితే వీటికి డబ్బులు చెల్లించకపోవడంతో విద్యుత్ మీటర్లకు సర్వీస్ నంబర్లు రాక విద్యుత్ బిల్లులు తీసేందుకు వీలు పడడంలేదు. ఈ క్రమంలో నాలుగు నెలల కిందట ఒకసారి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కాలనీ వాసుల ఆందోళనతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అప్పట్లో విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు డబ్బులు చెల్లించాలని విద్యుత్ శాఖాధికారులు గ్రామ పంచాయతీ అధికారులకు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

బయటకు రావాలంటే ఇబ్బంది

ఇళ్లల్లో విద్యుత్ ఉన్నప్పటికీ వీధి లైట్లు వెలగకపోవడంతో బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. జి.కొండూరు గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న జగనన్న కాలనీ ఉంది. కాలనీ వాసులకు ఏ అవసరం ఉన్నా జి.కొండూరు రావాల్సి ఉంది. ఈ క్రమంలో రెండు రోజులుగా కాలనీ వాసులు నరకయాతన పడుతున్నారు. ఉన్న రెండు బోర్లలో కూడా మోటార్లు విద్యుత్ లేక పనిచేయకపోవడంతో నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే కాలనీలో రోడ్డు అధ్వానంగా మారి, డ్రెయినేజీలు లేక, తాగు నీరు లేక నరకయాతన పడుతుంటే చివరికి విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేస్తే తామెలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతూ శనివారం రాత్రి రోడ్డెక్కి నిరసన తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో నష్టం



పైడూరుపాడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పైడూరుపాడు(విజయవాడ రూరల్): వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని వైఎస్సార్ సీపీ విజయవాడ రూరల్ మండల కన్వీనర్ బయ్యారపు రవికిశోర్ అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమ పోస్టర్లను శనివారం పైడూరుపాడు గ్రామంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని చెప్పారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య రంగాన్ని సువర్ణ అధ్యాయంగా మార్చారన్నారు. ఆయన పాలనలో 17 వైద్య కళాశాలలను మంజూరు చేయించి వాటిలో ఐదు పూర్తి చేశారని చెప్పారు. మరో మూడు తుది దశకు చేరుకున్నాయన్నారు. వైఎస్సార్ కాలనీ ఎంపీటీసీ సభ్యుడు కె.సత్యనారాయణ, మహిళా నాయకులు షేక్ ఖాసింబీ, నాయకులు కె.మహేష్, డొక్కా వెంకటరత్నం, పి.రవీంద్ర, జి.అశోక్, కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంతకాల సేకరణ జరిగింది.

మద్యం షాపుల్లో తనిఖీలు



మైలవరంలోని మద్యం షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారి

మైలవరం: మైలవరంలోని మద్యం షాపుల్లో ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ములకల చెరువు కల్తీ మద్యం మూలాలు ఇబ్రహీంపట్నంలో దొరికిన నేపథ్యంలో మైలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాలు ముఖ్యంగా జి.కొండూరు మండలంలోని కవులూరు, కట్టుబడిపాలెం, చెరువు మాధవరం తదితర గ్రామాలు, తెలంగాణ సరిహద్దులోని మొరుసుమల్లి, పుల్లూరు, గంగినేని వంటి గ్రామాల్లో వెహికల్ చెక్, అనధికార మద్యం విక్రయాలు, వైన్ షాపుల్లో తనిఖీలు చేపట్టామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మైలవరంలోని మద్యం షాపుల్లో స్టాక్స్ తనిఖీ చేపట్టారు. కల్తీ మద్యంపై ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా ప్రతాప్ అప్పారావు జన్మదిన వేడుకలు



ప్రతాప్ అప్పారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నూజివీడు: నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జన్మదిన వేడుకలను కార్యకర్తలు, నాయకుల నడుమ శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయం ఉన్న ద్వారకా ఎస్టేట్‌కు ఉదయం నుంచే నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ప్రతాప్‌కు అప్పారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, ఏపీ స్టేట్ కో-పరేటివ్ యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మలిశెట్టి బాబీ, రైతు విభాగం అధ్యక్షుడు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి బసవా వినయ్, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పుచ్చకాయల సుబ్బారెడ్డి, బెజవాడ రాంబాబు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, నియోజకవర్గంలోని సర్పంచులు విచ్చేసి ప్రతాప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

భూములు లాక్కోవాలని చూస్తే సహించం

నూజివీడు: శ్రీకాకుళం జిల్లాలో పోలీసు నిర్బంధాల ద్వారా రైతుల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తే సహించేది లేదని, దానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడి తీరుతామని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి. హరినాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్‌కు, ఆముదాలవలస నియోజకవర్గంలో థర్మల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు పోరాటాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు కార్పొరేట్లకు, ల్యాండ్ మాఫియాకు భూములు ధారాదత్తం చేయటానికి సిద్ధమయ్యారని హరినాథ్ ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు.

14న ఉచిత నేత్ర వైద్యశిబిరం

తిరువూరు: గంపలగూడెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఈ నెల 14న వర్తకసంఘ కార్యాలయంలో నిర్వహిస్తామని వికాస తరంగిణి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్దార్థ వైద్య కళాశాల వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేస్తారన్నారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి కళాశాలలో ఉచితంగా ఆపరేషన్ చేసి కళ్లజోళ్లు అందజేస్తారని చెప్పారు.

యనమదల హైస్కూల్ ప్రహరీ నిర్మించాలి



నూజివీడు: యనమదలలోని జెడ్పీ హైస్కూల్ ప్రహరీ కూలిపోయి 13 నెలలు గడిచినా ఇంతవరకు నూతన గోడ నిర్మాణం చేపట్టలేదు. దీంతో పాఠశాలలోకి పశువులు రావడం, రాత్రి సమయంలో, సెలవు రోజుల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. గత ఏడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరద ఉధృతికి దాదాపు 50 మీటర్ల పొడవున ప్రహరీ కూలిపోయింది. అప్పటి నుంచి ప్రహరీని పాలకులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రకటన

నా క్లయింట్ గుంటూరు జిల్లా, నరసరావుపేట, వినుకొండ రోడ్డు, కాశ్మీరి వలీ, డోరు నెం. 1-111 ఈ కాపురస్తులు గొల్లపల్లి బాలసుందర రావు గారి కుమారుడు గొల్లపల్లి సుదీర్ రాజా గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా యీ దిగువ షెడ్యూలు ఆస్తిని ఇబ్రహీంపట్నం కాపురస్తులు నంబూరు నాగమల్లేశ్వరరావు గారి కుమారుడు నంబూరు రవి కుమార్ గారు వారి తండ్రి గారి నుండి దఖలు పొంది, శ్రీ ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము, నెం. 4886/2018 దస్తావేజుగా రిజిస్టరు పొంది వారి సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్విఘ్నాదముగా అనుభవించుచున్నారు. సదరాస్తిని నంబూరు నాగమల్లేశ్వరరావు గారు తాళ్లపల్లి సుబ్బారావు గారి వద్ద క్రయమునకు పొంది, శ్రీ ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము, నెం. 3296/ 1998 దుగా రిజిస్టరు పొందియున్నారు. సదరు నెం. 3296/1998 దుగా రిజిస్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజు గైర్హాజరీ అయినదని తెలిపియున్నారు.

సదరాస్తిని నంబూరు రవి కుమార్ గారు విక్రయ ప్రయత్నము చేయగా నా క్లయింట్ విక్రయ ఖరారు చేసుకొని యున్నారు. సదరాస్తి పైన ఎవ్వరికైన యెట్టి హక్కులు గాని, బాధ్యతలు గాని, ఛార్జీలు దేవ్వగల కోర్టు జప్తులు వగైరాలు వున్న యెడల యీ ప్రకటన వెలువడిన పది రోజులలోగా వారు గాని, నా క్లయింట్ గారికి లిఖిత పూర్వకముగా తెలియచేయవలసినది.

అట్లు తెలియచేయనిచో యెటుల సదరాస్తిని నిర్విఘ్నాదము అంటూ ఆస్తిగా యెంచి నా క్లయింట్ క్రయ దస్తావేజును పొంది రిజిస్టరు చేయించుకొనవలయును. తదుపరి వచ్చు యెట్టి క్లెయిములు నా క్లయింట్కు బద్ధకము చేయకూడదు.

షెడ్యూలు: NTR జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, కొండపల్లి మున్సిపల్ ఏరియాలో చేరిన ఇబ్రహీంపట్నం గ్రామ ఆర్ సర్వే నెం. 238/ఎ ల దాఖలా— తూర్పు: కొండపల్లి సాంబశివరావు గారి తాలూకు 13 1/2 లింకులు వెడల్పు గల స్థలం, అ. 30-0లు, దక్షిణం: కొండపల్లి సాంబశివరావు గారి ఆస్తి అ. 34-9 లు. పడమర: కుంచం నర్సమ్మ గారి ఆస్తి అ. 33-6 లు. ఉత్తరం: పంచాయితీ పెద్ద బజారు అనగా మునిసిపల్ రోడ్డు అ. 34-3 లు

యీ హద్దుల మధ్య పంచాయితీ ప్రకారము చ.గ. 121.7 లు లేక చ.మీ. 101.757 గల స్థలాన్ని [illegible] స్థలమున్నూ సదరు స్థలములో నిర్మించియున్న గ్రౌండ ఫ్లోరు గల RCC [illegible] కట్టడముకు [illegible] సామానులు, ఎలక్ట్రికల్ సర్వీసులు, ఫిట్టింగులు, అందలి లైట్లు, [illegible] సహాయమున్నూ, మరియు నాకు గల [illegible] హక్కులతో సహా గల ఆస్తి.

కొమ్మకూరి చంటి బాబు, న్యాయవాది

డా।। జాకీర్ హుస్సేన్ కాలేజి రోడ్డు, ప్రసాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఎన్.టి.ఆర్. జిల్లా, సెల్: 9908222258

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న వరికూటి ప్రతాప్



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

ముసునూరు: జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్‌కు ఆప్సా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శనివారం అందజేశారు. గుంటూరులోని ఆప్సా డెమోక్రటిక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పొగాకు యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఎన్నార్ఐల విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

పలగానికి అవార్డు..

చాట్రాయి: చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావుకు ఆప్సా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గుంటూరులోని ఆప్సా డెమోక్రటిక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

మీర్జాపురంలో సీపీఎం బృందం పర్యటన

నూజివీడు: మండలంలోని మీర్జాపురంలో శనివారం పర్యటించిన సీపీఎం బృందం వద్ద గ్రామస్తులు అనేక సమస్యలు ప్రస్తావించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రాజు, సీపీఎం మండల కార్యదర్శి పాలేటి సుభాష్ చంద్రబోస్‌లు గ్రామంలో పర్యటించారు. గంగానమ్మ బజారులో పర్యటించగా రోడ్లపైనే మురుగునీరు నిల్వ ఉంటోందని, దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోయారు. రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఆ తరువాత ఏమైందో పనులు చేయకుండా ఆపేశారని స్థానికులు వాపోయారు. అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు చెప్పారు.

గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి పూజ

తిరువూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపడుతున్న గోకులంషెడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. కాకర్ల, లక్ష్మీపురం గ్రామాల్లో 4 షెడ్లకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకం కింద తమ పొలంలో లేదా ఇంటి ఆవరణలో పశువుల షెడ్లను నిర్మించుకోవచ్చని చెప్పారు. మండలంలో 60 షెడ్ల నిర్మాణానికి అనుమతి లభించిందని, ఒక్కొక్క రైతుకు రూ.2 లక్షల మేర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి వివరించారు.

బీరు సీసాతో దాడి చేశారని ఫిర్యాదు

మైలవరం: ఓ వ్యక్తిపై ముగ్గురు బీరు సీసాతో దాడి చేశారు. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరంలోని నారాయణ నగర్ సమీపంలోని మామిడి తోటలో కోళ్లు పెంచుకుంటూ అక్కడే నివాసం ఉంటున్న వ్యక్తి తలపై శుక్రవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు బీరు సీసాలతో దాడి చేశారు. పూటుగా మద్యం సేవించి తోటలో ఉన్న ఫర్నిచర్, లైట్లు ధ్వంసం చేసి వారి ఇష్టారాజ్యంగా అక్కడ ఉన్న వ్యక్తిని దుర్భాషలాడారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.